దళితుడు చనిపోయిన బెడ్‌ను
భార్యతో కడిగించారు
మధ్యప్రదేశ్ ప్రభుత్వ దవాఖానలో అమానుషం

బెడ్‌ను కడుగుతున్న దళితుడి భార్య

భోపాల్: బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లోని డిండోరీ జిల్లా ప్రభుత్వ దవాఖాన సిబ్బంది అమానుషంగా వ్యవహరించారు. గాయపడిన రామ్‌రాజ్ మరవి (28) చికిత్స పొందిన పడకపై రక్తాన్ని ఆయన భార్య, ఐదు నెలల గర్భిణి అయిన రోషిణి చేత కడిగించారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో రావడంతో విమర్శలు వస్తున్నాయి. రామ్‌రాజ్ కుటుంబ సభ్యులకు తమ సమీప బంధువులతో భూ వివాదం ఉంది. ఈ నేపథ్యంలో జరిగిన దాడిలో రామ్‌రాజ్ ఇద్దరు అన్నయ్యలు, తండ్రి మరణించగా, రామ్‌రాజ్ గాయాలతో జిల్లా దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం మరణించారు. ఆయనకు చికిత్స చేసిన బెడ్‌పై రక్తాన్ని ఆయన భార్య చేత దవాఖాన సిబ్బంది కడిగించారు. ఆమెకు దవాఖాన సిబ్బంది నీళ్లు ఇస్తూ, ఆదేశాలు ఇవ్వడం కనిపించింది. దీనిపై వివాదం రేగడంతో ఓ వైద్యుడు వివరణ ఇచ్చారు. రోషిణి తన భర్త రక్త నమూనాలను తీసుకున్నారని చెప్పారు. బెడ్‌ను శుభ్రం చేయాలని ఆమెను ఎవరూ కోరలేదన్నారు.

కెనడా మంత్రి ఆరోపణలు అసంబద్ధం: భారత్

న్యూఢిల్లీ, నవంబర్ 2: కెనడాలో ఖలిస్థానీ అనుకూలురపై దాడులకు భారత హోం మంత్రి అమిత్ షా ఆదేశాలు ఇచ్చారంటూ కెనడా మంత్రి చేసిన ఆరోపణలపై భారత ప్రభుత్వం శనివారం తీవ్రంగా మండిపడింది. ఆ ఆరోపణలు పూర్తిగా అసంబద్ధమైనవి, ఆధార రహితమైనవని తెలిపింది. కెనడాలో నివసిస్తున్న సిక్కు వేర్పాటువాదులు లక్ష్యంగా హింస, బెదిరింపులు, గూఢచర్యానికి పాల్పడాలంటూ అమిత్ షా ఆదేశాలు ఇచ్చారని కెనడా విదేశాంగ శాఖ సహాయ మంత్రి డేవిడ్ మారిసన్ మంగళవారం ఆరోపించారు. కెనడా మంత్రి బాధ్యతా రాహిత్య వైఖరి కారణంగా ఇరు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతింటాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఈ మేరకు కెనడా హై కమిషన్ ప్రతినిధిని శుక్రవారం పిలిపించి మన నిరసన తెలియజేసినట్టు చెప్పారు.

మమ్మల్ని విరోధిగా పేర్కొనడం దాడి వ్యూహమే

తమ దేశానికి భారత్‌తో సైబర్ ముప్పు పొంచి ఉన్నదని పేర్కొన్న కెనడాకు భారత్ శనివారం గట్టిగా బదులిచ్చింది. కెనడియన్ సెంటర్ ఫర్ సైబర్ సెక్యూరిటీ సంస్థ ఇటీవల వెలువరించిన నివేదికలో భారత్‌ను 'దేశ విరోధి' విభాగంలో చేర్చడంతో పాటు భారత్ నుంచి సైబర్ ముప్పు పొంచి ఉన్నదని పేర్కొన్నది. ఈ విషయమై భారత విదేశీ వ్యవహారాల అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పందించారు. భారత్‌పై దాడికి కెనడా అమలు చేస్తున్న వ్యూహాలకు ఇది ఒక ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. ఇలా అసంబద్ధ, నిరాధార ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు.

కెనడా పార్లమెంట్ బయట హిందూ జెండా
ఎగరేసిన భారత సంతతి ఎంపీ చంద్ర ఆర్య

ఒట్టావా, నవంబర్ 2: కెనడా పార్లమెంటు భవనం బయట 'ఓం' చిహ్నం కలిగిన హిందూ జెండాను కెనడా ఎంపీ చంద్ర ఆర్య ఎగురవేశారు. హిందూ వారసత్వ మాసం సందర్భంగా మూడేండ్లుగా ఆయన ఏటా హిందూ జెండా ఎగురవేస్తున్నారు. ఈ సందర్భంగా 'ఎక్స్'లో ఆయన తాజాగా పోస్ట్ చేశారు. 'కెనడా సమాజాల్లో మాది అత్యంత విద్యాధికమైన, విజయవంతమైన సమాజం. అన్ని రంగాల్లో హిందువులు రాణిస్తున్నారు. రాజకీయ రంగంలో మాత్రం సరైన ప్రాతినిధ్యం లేదు. హిందువులు ప్రజాస్వామ్య ప్రక్రియలో మరింత ఎక్కువగా పాలుపంచుకోవాలని పిలుపునిస్తున్నాను' అంటూ ఆయన పేర్కొన్నారు. కాగా, భారతీయ మూలాలు కలిగిన, హిందువు అయిన చంద్ర ఆర్య కెనడాలో ఖలిస్థానీలకు వ్యతిరేకంగా బలంగా గొంతు వినిపిస్తారనే పేరుంది.

ఎగిరిపోదాం విదేశాలకు

- రోజురోజుకూ పెరుగుతున్న అధిక సంపాదన మోజు
- అగ్ర దేశాల వీసాల కోసం లక్షలాది మంది నిరీక్షణ
- వీసా వస్తే లాటరీ తగిలినట్టేనని భారతీయుల సంబరం

న్యూఢిల్లీ, నవంబర్ 2: ఉన్నత చదువు, ఉద్యోగం, ఉపాధి పేరుతో మన దేశం నుంచి ఏటా లక్షలాది మంది విదేశాలకు ఎగిరిపోతున్నారు. ఒకసారి విదేశాలకు వెళ్లిన వారు తిరిగి భారత్‌కు రావడం ఇంచుమించు జరగడం లేదు. ప్రపంచంలో అతి పెద్ద విదేశీ వీసా భాగస్వాములుగా భారతీయులు నిలుస్తున్నారు. విద్యార్థులు, వృత్తి నిపుణులు అమెరికా, యూకే, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ వీసాల కోసం క్యూలు కడుతున్నారు. అధిక సంపాదన కలను నెరవేర్చుకోవడమే తమ జీవిత లక్ష్యంగా చాలామంది ఉన్నారు. విదేశాల్లోని మంచి కాలేజీలు, యూనివర్సిటీల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తే కెరీర్ అవకాశాలు మెండుగా ఉంటాయన్న ఆశతో పెద్దయెత్తున ప్రతి ఏడాది విద్యార్థులు విదేశాలకు క్యూ కడుతున్నారు. దీనికి లక్షల రూపాయలు ఖర్చవుతున్నా తల్లిదండ్రులు కూడా వెనుకడుగు వేయడం లేదు. వీసా వస్తే చాలు లాటరీ కొట్టినంతగా సంబర పడిపోతున్నారు. ఈ ఏడాది మన దేశం నుంచి సుమారు 18 లక్షల మంది విద్యార్థులు విదేశాల్లో చదువుల కోసం వెళ్లగా, వీరు ఖర్చు చేసిన మొత్తం 80 బిలియన్ డాలర్లు.

వీసాలు.. అవకాశాలకు ముఖ ద్వారాలు

వీసాలు కేవలం ప్రయాణానికి నిర్దేశించిన ప్రామాణిక పత్రాలు కాదు.. అవి అవకాశాలకు ముఖ ద్వారాలు. పెద్దగా చదువుకోని వారు, నిరక్షరాస్యులు ఉపాధి కోసం గల్ఫ్ బాట పడుతున్నారు. యూఏఈ, ఖతార్, సౌది అరేబియా, కువైట్, ఒమన్, దుబాయ్‌లకు నిత్యం వేలాది మంది కార్మికులు, శ్రామికులు ఉపాధి కోసం వెళ్తున్నారు. ఇప్పటికే ఆయా దేశాల్లో సుమారు 1.3 కోట్ల మంది భారతీయులు పనిచేస్తున్నారు. అలాగే విదేశాల్లో ఉండే మన దేశ రాయబారులు సైతం తమ పిల్లలను అక్కడే చదివించడానికి ఇష్టపడుతున్నారు. ఉద్యోగ నిర్వహణలో భాగంగా వారు భారత్‌కు తిరిగి రావాల్సి ఉన్నా, తమ పిల్లలను మాత్రం అక్కడే ఉంచేస్తున్నారు.

రికార్డు స్థాయిలో అమెరికా వీసాలు

వీసా వచ్చిందంటే మాకు హక్కు వచ్చినట్టేనని ఇక్కడి వారు భావిస్తున్నారు. అమెరికాలో అధ్యక్ష ఎన్నికల కారణంగా వీసా ప్రక్రియను తాత్కాలికంగా ఆపివేయడంతో ఎన్నికలు ఎప్పుడవుతాయా అని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. అమెరికా 2023లో రికార్డు స్థాయిలో ఎన్నడూ లేనంతగా 1,40,000 విద్యార్థి వీసాలు మంజూరు చేసింది. వీటికి 3,80,000 ఉద్యోగ వీసాలు అదనం. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జూన్ వరకు ఎక్కువ సంఖ్యలో విద్యార్థి వీసాలు జారీ అయ్యాయి. ధనిక, శ్రేయస్సు దేశంగా పేరొందిన అమెరికా, యూకేలపై అన్ని వర్గాల వారు పరుగులు తీస్తున్నారు. సెప్టెంబర్‌లో యూఎస్ యూనివర్సిటీలకు పెద్దయెత్తున భారతీయ విద్యార్థులు తరలివెళ్లారు.

భారత దేశ పౌరసత్వానికి గుడ్‌బై

క్రమంగా మన దేశ పౌరసత్వాన్ని వదులుకుని విదేశాలకు వెళ్తున్న వారి సంఖ్య పెరుగుతున్నది. 2022లో 2,25,620 మంది తమ పౌరసత్వాన్ని త్యజించగా, 2023లో ఈ సంఖ్య కొద్దిగా తగ్గి 2,16,219గా నమోదైంది. అదే సమయంలో 1,000 మంది శరణార్థులకు మన దేశ పౌరసత్వం లభించింది. వీరిలో చాలామంది పాకిస్థాన్‌కు చెందిన వారే. అలాగే ఎలాంటి పన్నుల జంజాటం లేని యూఏఈ లకు వెళ్లే ఉద్యోగులు, నిపుణుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంది. ఇక వీరే కాకుండా మన దేశ రాజకీయ భావజాలం నచ్చని వారు, వేర్పాటువాదాన్ని ప్రోత్సహించే ఖలిస్థాన్ అనుకూలురు వంటి వారు కూడా కెనడా, యూకే లాంటి దేశాలకు వెళ్లి అక్కడి నుంచే నేరుగా తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఇలా ఉండగా, అధికారికంగా తమ దేశాలకు వచ్చే విదేశీయుల కన్నా అనధికారికంగా వచ్చే శరణార్థులు, వలసవాదుల సంఖ్యే కొన్ని అగ్రదేశాల్లో ఎక్కువగా ఉంది. ఈ క్రమంలోనే ఇటీవల అమెరికా అక్కడ అనధికారికంగా, వీసా గడువు ముగిసినా అక్కడే ఉన్న కొందరు భారతీయులను ప్రత్యేక విమానాల్లో మన దేశానికి పంపేసింది.

భారత్‌కు నష్టమా?

మన దేశం నుంచి విదేశాలకు వెళ్తున్న వారి కారణంగా దేశ వార్షిక జీడీపీ 0.5 శాతం తగ్గుతున్నట్టు అంచనా. మన దేశంలో నిపుణులు, మేధావులకు కొరత లేదని.. ప్రతి ఏడాది లక్షల మంది విదేశాలకు వెళ్తున్నా.. అంతకు నాలుగైదు రెట్ల మంది నిపుణులు తయారవుతున్నారని, పైగా విదేశాలకు వెళ్లిన వారి ద్వారా మనకు విదేశీ మారకద్రవ్యం పెద్దయెత్తున వస్తున్నట్టు కొందరు మేధావులు చెబుతున్నారు. అయితే ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ ఇలా నిపుణులు, మేధావులను కోల్పోవడం మంచిది కాదని మరికొందరు సూచిస్తున్నారు.

ఉగ్రవాదులు పట్టుబడితే చంపొద్దు

- ప్రాణాలతో పట్టుకుని లోతుగా విచారించాలి
- ఎన్సీ అధినేత ఫరూక్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు

శ్రీనగర్, నవంబర్ 2: జమ్ము కశ్మీర్‌లో వరుస ఉగ్రవాద ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, జమ్మూ కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులు పట్టుబడితే చంపొద్దని, ప్రాణాలతో పట్టుకుని లోతుగా విచారించాలని అన్నారు. సరిహద్దులో ఉగ్రవాదుల నెట్‌వర్క్, సూత్రధారుల గురించి తెలుసుకోవాలని చెప్పారు. ఇటీవల జరిగిన బుద్గామ్ ఉగ్రవాద దాడిపై లోతైన విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జమ్మూ కశ్మీర్‌లోని ఒమర్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని అస్థిరపర్చేందుకు కొందరు ఈ దాడి చేయించినట్టుగా అనుమానం ఉందన్నారు. ఉగ్రవాదుల్ని చంపకూడదని, పట్టుకుని విచారిస్తే సీఎం ఒమర్ సర్కారును అస్థిరపర్చేందుకు ఏదైనా సంస్థ ప్రయత్నం చేస్తున్నదా అనే విషయం తెలుతుందని అభిప్రాయపడ్డారు. బుద్గామ్ ఘటనలోనూ పాక్ పాత్ర ఉండొచ్చు కదా అని విలేకరులు ప్రశ్నించగా "ఇందులో ఎలాంటి సందేహం లేదు. కానీ ఈ ఘటనపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది" అన్నారు.

కేంద్రం సీరియస్‌గా తీసుకోవాలి

ఫరూక్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారానికి దారి తీశాయి. అబ్దుల్లా వ్యాఖ్యలను ఎన్సీపీ(ఎస్సీ) వర్గం అధ్యక్షుడు శరద్ పవార్ స్వాగతించారు. 'ఫరూక్ అబ్దుల్లా చాలా సీనియర్ నేత. ఆయన చిత్తశుద్ధి, నిజాయతీ పట్ల నాకు ఎలాంటి సందేహం లేదు. అలాంటి నేత చేసిన వ్యాఖ్యలను కేంద్ర ప్రభుత్వం, హోంశాఖ తీవ్రంగా పరిగణించి, సమస్యను ఎలా పరిష్కరించాలో ఆలోచించాలి.' అని అన్నారు.

దర్యాప్తు జరపాల్సిన అవసరం ఏముంది?

ఫరూక్ అబ్దుల్లా వ్యాఖ్యలను బీజేపీ జమ్మూ కశ్మీర్ అధ్యక్షుడు రవీందర్ రైనా తప్పుబట్టారు. "ఉగ్రవాదం పాకిస్థాన్ నుంచి వస్తున్నదనే విషయం ఫరూక్ అబ్దుల్లాకు తెలుసు. ఇది అందరికీ తెలిసిన నిజం. ఇందులో దర్యాప్తు జరపాల్సిన అవసరం ఏముంది? మానవత్వానికి శత్రువులైన వారితో మనమంతా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉంది" అని రవీందర్ రైనా సూచించారు.

97.5 శాతం విద్యా సంస్థల్లో
బాలికలకు ప్రత్యేక టాయిలెట్లు!
సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్

న్యూఢిల్లీ: దేశంలోని 97.5 శాతం విద్యా సంస్థల్లో బాలికలకు ప్రత్యేక మరుగుదొడ్డి సౌకర్యాన్ని కల్పించినట్టు కేంద్రం వెల్లడించింది. దేశంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఈ సౌకర్యం ఉన్నట్టు సుప్రీం కోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో పేర్కొంది. ప్రభుత్వ, ఎయిడెడ్, రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో 6 నుంచి 12 తరగతుల వరకు చదివే బాలికలకు శానిటరీ ప్యాడ్స్ ఉచితంగా అందజేయాలని, వారికి ప్రత్యేక మరుగుదొడ్డి సౌకర్యం కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కాంగ్రెస్ నేత జయా ఠాకూర్ సుప్రీంలో పిల్ దాఖలు చేశారు.దేశంలోని 10 లక్షల ప్రభుత్వ పాఠశాలల్లో 16 లక్షల మరుగుదొడ్లు బాలురకు, 17.5 లక్షలు బాలికలకు నిర్మించామని, ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాల్లో బాలురకు 2.5 లక్షలు, బాలికలకు 2.9 లక్షల టాయిలెట్లను నిర్మించినట్టు కేంద్రం తెలిపింది.

చోద్యం ఆపి చర్యలు చేపట్టండి
మిత్ర దేశాలకు జెలెన్‌స్కీ విజ్ఞప్తి

కీవ్: రష్యాకు వచ్చిన ఉత్తర కొరియా సేనలు యుద్ధ రంగంలోకి దిగడం కోసం వేచి చూడటం ఆపి, తగిన చర్యలను ప్రారంభించాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్‌స్కీ మిత్ర దేశాలను కోరారు. ఉత్తర కొరియా సేనలు ఎక్కడ ఉన్నదీ తమకు తెలుసునని, వారిపై ముందుగానే తాము దాడి చేయవచ్చునని అన్నారు. అయితే, పాశ్చాత్య దేశాలు తయారు చేసిన దీర్ఘ శ్రేణి ఆయుధాలను రష్యాలోని లక్ష్యాలపై దాడి చేయడానికి ఉపయోగించడం కోసం మిత్ర దేశాల అనుమతి అవసరమని చెప్పారు. అమెరికా, బ్రిటన్, జర్మనీ రష్యా చర్యలను చూస్తూ ఉన్నాయని, ఉత్తర కొరియా సైన్యం ఉక్రెయిన్‌పై దాడిని ప్రారంభించడం కోసం వేచి చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 8,000 మంది ఉత్తర కొరియా సైనికులు రష్యాకు వెళ్తున్నట్లు అమెరికా గురువారం వెల్లడించింది. వీరిలో 7,000 మందికి రష్యాలో ఐదు చోట్ల శిక్షణ ఇస్తున్నారని ఉక్రెయిన్ చెబుతున్నది.

హిమాచల్ దివాలా!

రెండేండ్ల కాంగ్రెస్ పాలనతో రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం
10 గ్యారెంటీల అమలు సైతం అంతంతే
సుఖు పాలనపై సొంత పార్టీలోనే వ్యతిరేకత

షిమ్ల, నవంబర్ 2: అధికారం చేపట్టిన రెండేండ్లలోనే కాంగ్రెస్ పార్టీ హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసింది. 10 గ్యారెంటీల పేరుతో అలవికాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ ఇప్పుడు దివాలా దిశగా రాష్ట్రాన్ని నడిపిస్తున్నది. ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు సైతం సరిగ్గా ఇవ్వలేని స్థితికి ప్రభుత్వం చేరుకున్నది. దీంతో సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు పాలనపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సొంత పార్టీ ఎమ్మెల్యేలు సైతం ఆయన పాలనపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అరకొరగా గ్యారెంటీల అమలు

ఎన్నికల ముందు పాత పింఛన్ విధానాన్ని తిరిగి తీసుకొస్తామని, ఉచిత విద్యుత్తు, మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామనే అనేక హామీలను కాంగ్రెస్ పార్టీ ఇచ్చింది. అయితే, ఈ హామీల్లో చాలావరకు అమలుకు నోచుకోలేదు. అరకొరగా అమలు చేస్తున్న గ్యారెంటీలతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతున్నది. దీంతో కొన్ని నెలలుగా వేతనాలు, పింఛన్లను ప్రభుత్వం సమయానికి ఇవ్వడం లేదు. రెండేండ్లుగా ఖాళీగా ఉన్న పోస్టులను పూర్తిగా తొలగించాలని ఇటీవల నిర్ణయం తీసుకొని, పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడంతో వెనక్కు తగ్గింది. ఇదేవిధంగా టాయిలెట్ ట్యాక్స్ విధించాలని నిర్ణయం తీసుకొని, విమర్శలు రావడంతో విరమించుకుంది. గత ప్రభుత్వంలో ఉన్న పలు పథకాలను తొలగించడంతో పాటు కొత్తగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి బిల్లులను అమలులోకి తేవడం పట్ల ప్రజలు అసంతృప్తితో ఉన్నారు. 'అధికారంలోకి వచ్చిన మొదట్లో గత ప్రభుత్వాన్ని సాకుగా చూపిస్తే చెల్లింది. ఈ రెండేండ్లలో ప్రజలు విసిగిపోయారు' అని కాంగ్రా జిల్లాకు చెందిన ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే వ్యాఖ్యానించడం దీనికి అద్దం పడుతున్నది.

ఇజ్రాయెల్ దాడుల్లో 77 మంది మృతి

- లెబనాన్, గాజాలపై కొనసాగిన పోరు
- 3 క్షిపణులతో లెబనాన్ ప్రతి దాడి

ఇజ్రాయెల్ పట్టణం టైరాలో ధ్వంసమైన ఓ ఇల్లు

గాజా, టెల్‌అవీవ్, నవంబర్ 2: లెబనాన్, గాజాలపై ఇజ్రాయెల్ తన పోరు కొనసాగిస్తున్నది. లెబనాన్ ఈశాన్య ప్రాంతంలోని వ్యవసాయ గ్రామాలపై శుక్రవారం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 52 మంది పౌరులు మరణించగా, అనేక మంది గాయపడినట్టు లెబనాన్ ఆరోగ్య శాఖ వెల్లడించింది. కాగా, ఇజ్రాయెల్ వైమానిక దళాలు గురువారం ఒక దవాఖాన లక్ష్యంగా సెంట్రల్ గాజాలో జరిపిన దాడుల్లో 25 మంది పౌరులు మరణించారు. మూడు రోజుల్లో అమెరికా అధ్యక్ష ఎన్నికలున్న క్రమంలో గాజా సంక్షోభానికి తాత్కాలికంగా తెర దించడానికి ఇరు దేశాల మధ్య కాల్పుల ఒప్పందానికి బైడెన్ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుండగానే ఇజ్రాయెల్ తన దాడుల పరంపర కొనసాగిస్తూనే ఉంది. కాగా, ఇజ్రాయెల్ లోని టైరా పట్టణంపై శనివారం తెల్లవారుజామున లెబనాన్ జరిపిన దాడుల్లో 11 మంది గాయపడినట్టు ఇజ్రాయెల్ ఎమర్జెన్సీ సర్వీసెస్ తెలిపింది. లెబనాన్ నుంచి మూడు క్షిపణులు ప్రయోగించారని, వాటిని తిప్పికొట్టినట్టు వెల్లడించింది.

ఇజ్రాయెల్ నిఘా కేంద్రంపై హెజ్బొల్లా దాడి

ఇజ్రాయెల్ సైనిక నిఘా కేంద్రం గ్లిలోట్ బేస్‌పై రాకెట్లతో దాడి చేసినట్లు హెజ్బొల్లా శనివారం ప్రకటించింది. టెల్ అవీవ్ సమీపంలోని గ్లిలోట్ బేస్ నుంచి శనివారం రాత్రి రాకెట్లతో దాడి చేశామని ఈ సంస్థ తెలిపింది.

ప్రతీకారం తప్పదు: ఖమేనీ

ఇరాన్‌పై దాడులకు పాల్పడుతున్న ఇజ్రాయెల్‌తోపాటు ఆ దేశానికి అండగా నిలుస్తున్న అమెరికాపై ప్రతీకారం తీర్చుకుంటామని ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ స్పష్టం చేశారు. ఇరాన్‌పై, రెసిస్టెన్స్ ఫ్రంట్‌పై దాడులు జరుపుతున్నవారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని, శత్రువులు జియోనిస్టు పాలకులైనా, అమెరికా అయినా కోలుకోలేని దెబ్బ కొడతామని హెచ్చరించారు. ఇస్లామిక్ విప్లవం అనంతరం 1979లో టెహ్రాన్‌లోని అమెరికా రాయబార కార్యాలయాన్ని స్వాధీనం చేసుకుని 45 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా ఖమేనీ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఒక ఎన్నికల్లో పనిచేస్తే
100 కోట్లు
తన ఫీజు వెల్లడించిన ప్రశాంత్ కిశోర్

న్యూఢిల్లీ, నవంబర్ 2: ఎన్నికల వ్యూహకర్తగా పేరొందిన ప్రశాంత్ కిషోర్, తన ఫీజు ఎంతన్న దానిపై మొదటిసారి పెదవి విప్పారు. ఒక పార్టీ లేదా ఒక రాజకీయ నేత కోసం ఒక్క ఎన్నికల్లో పనిచేస్తే..తన ఫీజు రూ.100 కోట్లు లేదా అంతకన్నా ఎక్కువే ఉంటుందని తాజాగా ప్రకటించారు. 'జన్ సురాజ్' పార్టీని స్థాపించిన ఆయన బీహార్‌లో నాలుగు అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13న జరగనున్న ఉప ఎన్నికల్లో అభ్యర్థులను నిలబెట్టారు. శనివారం ఎన్నికల సభలో ఆయన ప్రసంగిస్తూ 'ఎన్నికల ప్రచారానికి నిధులు ఎలా వస్తాయని ప్రజలు తరుచూ నన్ను అడుగుతున్నారు. నేను అంత బలహీనుడిగా కనిపిస్తున్నానా? ప్రచారానికి అవసరమయ్యే టెంట్లు వేసుకునే డబ్బు నా వద్ద లేదని మీరు అనుకుంటున్నారా? ఒక్క ఎన్నికల్లో వ్యూహకర్తగా నా ఫీజు రూ.100 కోట్లు. అంతకన్నా ఎక్కువే ఉంటుంది. నా వ్యూహాల వల్ల 10 రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఏర్పడ్డాయి' అని అన్నారు.

హారిస్ కోసం తులసేంద్రపురంలో పూజలు
అమెరికా ఎన్నికల్లో గెలవాలని ఆకాంక్ష

చెన్నై: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిని కమలా హారిస్ కోసం తమిళనాడులోని తులసేంద్రపురం గ్రామస్థులు పూజలు చేస్తున్నారు. దేవాలయం వద్ద ''కమల ఈ గ్రామానికి చెందిన గొప్ప బిడ్డ'' అంటూ పోస్టర్‌ను ఏర్పాటు చేశారు. ఆమె తాత పీవీ గోపాలన్ ఈ గ్రామంలోనే జన్మించారు. ఆమె తల్లి శ్యామల గోపాలన్ 19 ఏళ్ల వయసులో వైద్య విద్యను అభ్యసించేందుకు అమెరికాకు వెళ్లారు. అక్కడే కమల, ఆమె సోదరి మాయ జన్మించారు. తులసేంద్రపురం గ్రామస్థుడు ఒకరు మాట్లాడుతూ.. కమల హారిస్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడం గొప్ప చరిత్ర అని చెప్పారు. ఆమె గెలుపోటములతో తమకు సంబంధం లేదని, ఆమె పోటీ చేయడమే తమకు గర్వకారణమని తెలిపారు.

ఉచిత పథకాలు ప్రమాదకరం

- 'ఫ్రీ బస్సు'తో మహిళలు వృథా ప్రయాణాలు చేస్తున్నారు
- కొన్ని చోట్ల గ్యారెంటీ పథకాలు దుర్వినియోగం అవుతున్నాయి
- కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆర్వీ దేశ్‌పాండే వ్యాఖ్యలు

బెంగళూరు, నవంబర్ 2: కర్ణాటక కాంగ్రెస్‌లో గ్యారెంటీలపై లొల్లి చల్లారలేదు. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని సమీక్షిస్తామని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే ఆర్వీ దేశ్‌పాండే మద్దతు తెలిపారు. శుక్రవారం దేశ్‌పాండే మీడియాతో మాట్లాడుతూ.. 'డీకే శివకుమార్ మంచి ఉద్దేశంతోనే చెప్పారు. గ్యారెంటీ పథకాల కోసం ఏటా రూ.65 వేల కోట్లు అవసరం. కొన్ని మంచి పథకాలు ఉన్నాయి. అయితే, కొన్ని ప్రాంతాల్లో ఈ పథకాలను దుర్వినియోగం చేస్తున్నారు. ఉదాహరణకు శక్తి పథకం వల్ల కొందరు మహిళలు పదేపదే వెళ్లిన ప్రాంతాలకే మళ్లీ ప్రయాణిస్తున్నారు. ఉచితంగా ఇవ్వడం ఎంత మంచిదో అంత ప్రమాదకరం. మనకు పారదర్శకత ఉండాలి. అర్హులైన మేరకే ప్రమోజనాలు అందాలి. ఈ దిశగా ఆదేశాలు తప్పు కాదు.' అంటూ వ్యాఖ్యానించారు. కాగా, డీకే శివకుమార్ వ్యాఖ్యలను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వ్యతిరేకించినప్పటికీ దేశ్‌పాండే ఈ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

ఉచిత బస్సు ప్రయాణ దూరంపై పరిమితి?

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే శక్తి పథకాన్ని సమీక్షిస్తామని డీకే శివకుమార్ చేసిన వ్యాఖ్యలపై వివాదం రేగినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇప్పటికే ఈ పథకాన్ని సమీక్షిస్తున్నట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా మహిళలు ఉచితంగా ప్రయాణించే దూరంపై పరిమితి విధించే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయ సమాచారం. అయితే, రోజువారీగా లేదా నెలవారీగా ఈ పరిమితి విధించాలా అనేది ఆలోచిస్తున్నట్టు చెప్తున్నారు. ఇందుకోసం ముందుగా మహిళలకు స్మార్ట్ కార్డులు జారీ చేయాలని భావిస్తున్నట్టు సమాచారం.

శిలాజ ఇంధనాలకు బదులుగా చెట్లు
విద్యుదుత్పత్తికి అనువైన రెండు జాతులు గుర్తింపు

కిగాలి, నవంబర్ 2: శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా కొంత మేరకు స్వచ్ఛ విద్యుత్తును ఉత్పత్తి చేయగల రెండు చెట్ల జాతులను రువాండాకు చెందిన శాస్త్రవేత్తలు గుర్తించారు. ఆఫ్రికా దేశమైన రువాండాలో విద్యుత్తు కొరత ఉంది. 2030 నాటికి గ్రామీణ ప్రాంతాలకు పూర్తిస్థాయిలో విద్యుత్తును సరఫరా చేయాలని రువాండా నిర్ణయించింది. దేశంలో వేగంగా, విరివిగా పెరిగే చెట్లపై అధ్యయనం చేయగా సెన్నా సియామియా, గ్లిరిసిడియా సేపియం అనే రెండు రకాల చెట్ల జాతులు విద్యుత్తు ఉత్పత్తికి అనువైనవని శాస్త్రవేత్తలు గుర్తించారు. వీటి దట్టమైన కలప, అధిక కాలోరిఫిక్ విలువల వల్ల వీటిని కాల్చినప్పుడు ఎక్కువ వేడిని ఉత్పత్తి చేస్తాయి. ఈ చెట్లతో విద్యుత్తు ఉత్పత్తి చేయడం పర్యావరణానికి మేలని వారు తెలిపారు.

గుమ్మడికాయ పడవపై 26 గంటల ప్రయాణం
గిన్నిస్ రికార్డు సాధించిన అమెరికా వాసి

*వాషింగ్టన్, నవంబర్ 2: కడవంత గుమ్మడికాయను పడవగా చేసుకొని దానిపై 26 గంటల్లో 73.50 కిలోమీటర్లు ప్రయాణించి గిన్నిస్ ప్రపంచ రికార్డును సాధించాడు అమెరికాకు చెందిన గ్యారీ క్రిస్టెన్‌సేన్. ఒరెగ్యాన్ హ్యాపీవాయలీకి చెందిన గ్యారీ 555.2 కేజీల గుమ్మడికాయలోని గుజ్జును తీసి పడవగా మార్చాడు. దీంత